క్లుప్తంగా

క్రీడాకారులను ప్రోత్సహించాలి



వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న రినీష్‌రెడ్డి

పెద్దేముల్: క్రీడాకారులను ప్రోత్సహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి తనయుడు పట్నం నిరీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంబాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నీకి ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఆటలతో స్నేహం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ నారాయణగౌడ్, ఎంపీటీసీ శ్రీనివాస్, సర్పంచ్, మాజీ సర్పంచ్ బలవంతురెడ్డి, రాములు యాదవ్, హర్షవర్ధన్‌రెడ్డి, కిరణ్, అక్రమ్, కలీల్, గోపిచంద్, సాగర్, అనంతయ్య, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడంలో ఆనందం



పుస్తె మెట్టెలను అందజేస్తున్న జెడ్పీటీసీ మేఘమాల

పూడూరు: నిరుపేదలకు సేవచేయడంతో సంతోషం ఉంటుందని జెడ్పీటీసీ మేఘమాల అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చన్గోముల్ గ్రామంలో మహేశ్వరి వివాహానికి పుస్తె మెట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా పేదలకు చేయూతను అందించడంలో తాము ఎల్లప్పుడూ ముందుంటామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు మల్లిక పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌గౌడ్

తాండూరు: మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తాండూరు మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు నర్కుల నరేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గంజ్ అసోసియేషన్ హాల్‌లో జరిగిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నాయకులు హాజరై సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంతో కార్మికులను న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కార్మికులకు ప్రతి నెల 1వ తేదీ వరకు వేతనాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్మిక విభాగం తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు గోపాల్, నాయకులు కృష్ణయ్య తదితరులున్నారు.

నవగ్రహ విగ్రహ పునఃప్రతిష్ఠాపన



కార్యక్రమంలో పాల్గొన్న శివభక్తులు

కుల్కచర్ల: మల్లిఖార్జున సేవా సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి దేవాలయ ప్రాంగణంలో నవగ్రహ విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శోభాయమానంగా నిర్వహించారు. ఆదివారం శివ భక్తుల ఆధ్వర్యంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపనతో పాటు ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

చేవెళ్ల: యువత అన్ని రంగాల్లో రాణించాలని చేవెళ్ల జెడ్పీటీసీ మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని క్రికెట్ జట్టు సభ్యులకు ఆదివారం స్పోర్ట్స్ డ్రెస్, క్రికెట్ కిట్లను అందజేసి మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తే వారిలోని ప్రతిభను వెలికి తీయవచ్చాన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎంతో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు ఉన్నారని వారిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. దీనికి టోర్నమెంట్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. మండలంలోని క్రీడాకారులకు తమ వంతు సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో క్రీడాకారులు, యువకులు, గ్రామస్తులు ఉన్నారు.

గ్రామ కమిటీ ఎంపిక

కేశంపేట: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ గ్రామ కమిటీని ఎంపిక చేశారు. గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో గ్రామంలోని కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశమై నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కుమార్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా గణేశ్, ప్రధాన కార్యదర్శిగా రాజు, యువజన అధ్యక్షుడిగా అఖిల్, ఉపాధ్యక్షుడిగా కుమ్మరి రఘును ఎన్నుకున్నారు.

ప్రతిపైసా పారదర్శకంగా..

- నిధుల వినియోగంలో పాత విధానానికి చెక్ పెట్టిన విద్యాశాఖ
- పీఎఫ్‌ఎంఎస్ ద్వారా లావాదేవీలు
- హెచ్‌ఎంలకు అవగాహన కల్పించిన అధికారులు



ఉమ్మడి జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

దౌల్తాబాద్: ఇప్పటి వరకు పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్, ఎంఆర్‌సీ నిధుల వినియోగంపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిన ఖర్చుపెట్టేవారు. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతిపైసా సద్వినియోగం అయ్యేలా సరికొత్త పద్ధతికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. పీఎఫ్‌ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం) ద్వారా లావాదేవీలు జరిగేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, స్కూల్ కాంప్లెక్స్, ఎంఆర్‌సీ ఖాతాల్లో నిధులు విడుదలయ్యాయి. పాఠశాలలు, ఎమ్మార్సీలు సీఆర్సీల నిర్వహణ నిధులు వినియోగంలో నూతన విధానానికి విద్యాశాఖ తెరతీసింది. విద్యాశాఖ ఇటీవల బడుల నిర్వహణకు 50శాతం నిధులు విడుదల చేసింది. ఖర్చు చేసే విధానంపై ఇప్పటికే మండలంలోని ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. పాత నిధులను డిసెంబర్ నెల 31 వరకు ఖర్చు చేస్తేనే మిగిలిన నిధులు విడుదలయ్యే అవకాశం కల్పించారు. లేకపోతే ఆ నిధులను వెనక్కి పంపిస్తామని ఆదేశాలు జారీచేశారు.

బిల్లులు తప్పనిసరి..

ఖర్చులకు సంబంధించి పాత పద్ధతి ప్రకారం ఎస్‌ఎంసీ ఖాతా, క్లస్టర్ హెచ్‌ఎం ఖాతా, ఎంఈఓ ఖాతాల్లో జమ చేసేవారు. ఎస్‌ఎంసీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులు కలిసి అవసరమైన బిల్లులు చెల్లించేవారు. నూతన విధానంతో ఇలాంటి పద్ధతి ఉండదు. విద్యాశాఖ వద్దే నిధులు ఉంటాయి. ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన బిల్లులు పీఎఫ్‌ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. పోర్టల్‌లో పొందుపర్చే బిల్లులు ఆధారంగా పనులు చేసే గుత్తేదారు, ఎస్‌ఎంసీ చైర్మన్ సామగ్రి కొనుగోలు చేసిన దుకాణ యజమాని, ఖాతాల్లో నేరుగా డబ్బులు జమవుతాయి. పాఠశాల అవసరాలకు ఏదైనా వస్తువులు కొనుగోలు చేసినా, చేసిన పనులకు ఎవరికైనా బిల్లులు చెల్లించాలన్నా దానికి సంబంధించిన వివరాలు పూర్తిగా ఆన్‌లైన్లో నమోదు చేయాలి. దీనిపై హెచ్‌ఎంలకు అవగాహన కల్పించారు. ఈ విధానం ద్వారా నిధులు పక్కదారి పట్టేందుకు అవకశాలు ఉండవని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

పాత నిధులపై సందిగ్ధత

పాఠశాలల్లో కొంత మంది హెచ్‌ఎంలు గతంలో విడుదలైన నిధులు ఖర్చు చేయలేదు. కొన్ని లక్షలు నిరుపయోగంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఖాతాలను గతేడాది ముగింపులో బ్లాక్ చేయించారు. తర్వాత సదరు ఖాతాలో ఉన్న నిధులను వెనక్కి మళ్లించారు. ఈ నిధుల వినియోగంపై విద్యాశాఖ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. పాత నిధులనుపై సందిగ్ధత నెలకొంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు

విద్యాశాఖకు సంబంధించిన అన్ని రకాల నిధుల ఖర్చు పీఎఫ్‌ఎంఎస్ విధానంలో ఖర్చుచేయాలి. అక్రమాలకు తావు లేకుండా పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. దీనికి సంబంధించి మండలంలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు అవగహన కల్పించారు.

– వెంకటయ్య, ఎంఈఓ

బ్యాంకర్లపై చర్యలు తీసుకోవాలి

సీపీఎం జిల్లా నాయకుడు మహిపాల్



నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు తదితరులు

బంట్వారం: రైతుబంధు డబ్బును పాత బకాయిల కింద జమ చేసుకుంటున్న బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మహిపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం తొర్మామిడి యూనియన్ బ్యాంక్ వద్ద రైతులకు మద్దతుగా సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడారు. రైతుల ఖాతాలను హోల్డ్‌లో నుంచి తొలగించి, వెంటనే రైతుబంధు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. సీఎం కేసీఆర్ రూ.లక్ష రుణ మాఫీ చేయకపోవడంతోనే రైతులకు పెద్ద సమస్యగా మారిందని, వెంటనే ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మణ్, నర్సింహులు, జనార్దన్, రవి, బక్కప్ప, జాఫర్‌మియ, అంజయ్య, పవన్, జనప్ప, మాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



కోట్‌పల్లిలో పగలే వెలుగుతున్న వీధిలైటు



నాగవరంలో..

పగలే వెన్నెల

పల్లెల్లో చాలా వరకు పట్టపగలే వీధి దీపాలు వెలుగుతూ కనిపిస్తున్నాయి. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో స్తంభాలపై లైట్లు వెలుగుతున్నా.. గ్రామ పంచాయతీ సిబ్బంది వాటిని పట్టించుకోవడం లేదు. ఇలా చేయడం వలన జీపీకి విద్యుత్ బిల్లు భారంగా మారుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇదే విషయమై ఎంపీఓ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. చర్యలు తీసుకుంటామని, ఇప్పటి వరకైతే తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని చెప్పారు. వీధి లైట్లకు సంబంధించి పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో ఆన్‌ఆఫ్ సిస్టం ఏర్పాటు చేయించామని, ఎక్కడైనా సమస్య ఉంటే సరి చేస్తామని చెప్పారు.

– బంట్వారం

గొల్లకుర్మలు ఐక్యంగా ఉండాలి

ఎంపీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గొల్లకుర్మలు

తాండూరు రూరల్: జిల్లాలో గొల్లకుర్మలు ఐక్యంగా ఉండాలని ఎంపీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య కురుమ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గౌతపూర్ గ్రామం మల్లిఖార్జునస్వామి దేవాలయ ప్రాంగణంలో రాష్ట్ర గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గొల్లకుర్మలు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం జెడ్పీటీసీ మంజుల మాట్లాడుతూ.. కుర్మలు ఓటెయ్యడానికే పరిమితం కాకుండా రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ ధనసిరి ప్రకాష్, సంఘం అధ్యక్షుడు పల్లె వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, నాయకులు మరాఠీ రాములు, హన్మయ్య, నర్సింహులు, భీమయ్య, చీమల నర్సింహులు, సాయిలు, శాంతు, శ్రీనివాస్, సురేష్, రమేష్ ఉన్నారు.

క్రీడాకారుడికి సన్మానం



క్రీడాకారుడు పార్థసారథిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ఒలంపిక్స్‌లో ఫెన్సింగ్‌లో రాణించడం అభినందనీయమని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఇటీవల నగరంలో జరిగిన ఫెన్సింగ్ అండర్14 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలకు హకీంపేట్ స్పోర్ట్స్ పాఠశాల తరఫున పాల్గొన్న మండల కేంద్రానికి చెందిన పార్థసారధి బంగారు పథకాన్ని సాధించారు. ఈ నేపథ్యంలో పార్టీ మండల నాయకులు ఆదివారం పార్థసారధిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, ఎంపీటీసీ ఆనందం, జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, నాయకులు ప్రేంప్రకాష్ రెడ్డి, వెంకట్రాములు, వెంకట్, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సంతలో సమస్యలు లేకుండా చర్యలు'

దోమ: సంతలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ కేశవులు చెప్పారు. మోత్కుర్‌లో సంత ఏర్పాటు చేసి మూడేళ్లు గడిచిన సందర్భంగా ఆదివారం గ్రామస్తులతో కలిసి వార్షికోత్సవం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం గ్రామంలో సంతను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందని, సంతకు వచ్చే ప్రజల సౌకర్యాలకై అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సంతలో ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మార్కెట్ చైర్మన్ చెన్నయ్య ముందుకు నడిపించారని కొనియాడారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్ రావు, మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌రావు, గ్రామస్తులు లింగయ్య, నర్సింహులు, గోపాల్, నర్సింహులు, కృష్ణయ్య, మోహన్ రెడ్డి, రాఘవులు, మల్లేశం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

బొంరాస్‌పేట: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గోర్‌సేనా జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 15న బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించి, అధికారికంగా నిర్వహించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

షాబాద్: నేడు షాబాద్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్తు కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారని తెలిపారు.

కాలనీల అభివృద్ధికి కృషి



పరిగి: కమిటీహాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని 4వ వార్డుల వేంకటేశ్వర కాలనీలో రూ.5లక్షలతో ఏర్పాటు చేస్తున్న కమిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులందరికీ కమిటీ హాల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కాలనీలోని సమస్యలు, ఇతర విషయాలను చర్చించుకునేందుకు హాల్ ఒక చక్కటి వేదిక అని చెప్పారు. కమిటీహాల్ నిర్మాణానికి ఇంకా నిధులు అవసరం అయితే.. ప్రభుత్వం నుంచి నిధులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, కౌన్సిలర్ రవీందర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, విజయ్‌రెడ్డి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో వృద్ధిచెందాలి

పూడూరు: చదువుకున్న నిరుద్యోగ యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పూడూరు మండల కేంద్రంలో ఎమ్మెల్యే సమక్షంలో ఆటో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవాభావంతో పని చేయాలని సూచించారు. ఒకరికి ఒకరు సహకారం కోసమే యూనియన్‌లు పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రఫిక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మేఘమాల, నాయకులు రాజేందర్, జంగయ్య, ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీ చేపట్టాలి



కుల్కచర్ల: పోలీసుల అదుపులో యూటీఎఫ్ నాయకులు

దోమ: 317 జీఓకు వ్యతిరేఖంగా హైదరాబాద్‌లోని డీఎస్పీ కార్యాలయం ఎదుట శనివారం మౌనదీక్ష చేసిన 13 జిల్లాల ఉపాధ్యాయ దంపతులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 19 జిల్లాల బదిలీలను చేపట్టి, 13 జిల్లాలను బ్లాక్ చేయడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పౌజ్ బదిలీలను నిర్వహించకుండా మొండివైఖరిగా ప్రవర్తించడం సరికాదన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉపాధ్యాయుడికి బదిలీ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

అరెస్టులతో పోరాటాలను ఆపలేరు

కుల్కచర్ల: అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని యూటీఎఫ్ కుల్కచర్ల మండల అధ్యక్షుడు శావుకు రమేష్, ప్రధాన కార్యదర్శి ఉప్పరి రమేష్ అన్నారు. జీఓ ప్రకారం తమను తమ జిల్లాకు బదిలీచేయాలంటూ ఆదివారం డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా యూటీఎఫ్ నాయకులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రస్తుతం బదిలీలు జరుగుతున్న సందర్భంలో ఇతర జిల్లాల నుంచి బదిలీ చేసిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలని సూచించారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉపాధ్యాయుల తరపున మరిన్ని పోరాటాలు చేసేందుకు సిద్ధమని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, సంఘ నాయకులు శ్రీశైలం, శీనయ్య, రాజు, శ్రీశైలం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

కొడంగల్: విద్యార్థులకు ధ్యానం యోగాపై అవగాహన కల్పించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించనున్నామని, విద్యార్థులు సద్వినియోగించుకోవాలని చెప్పారు. సహజ యోగా, సెల్ఫ్ రియలైజేషన్ టూర్ పేరుతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కొడంగల్‌లో ఈనెల 23,24,25 తేదీల్లో మాతాజీ నిర్మలా దేవి సహజ యోగా ట్రస్టు ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించనున్నామని చెప్పారు. విద్యార్థులు యోగాపై దృష్టి పెట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

ఇదేం ఎజెండా?

- మున్సిపల్ ఎజెండా కూర్పుపై కౌన్సిలర్ల కినుక
- నిధుల కేటాయింపులో పక్షపాతం ఎందుకంటూ ఎమ్మెల్యే వర్గం ఆగ్రహం



మున్సిపల్ కార్యాలయం

తాండూరు: మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం కోసం తయారు చేసిన ఎజెండాపై మెజార్టీ కౌన్సిలర్లు పెదవి విరుస్తున్నారు. ఈ నెల 25న తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు కౌన్సిలర్లకు ఎజెండా కాపీలను అందజేశారు. రూ.24 కోట్ల నిధులకు గాను మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం కోసం మొత్తం 41 అంశాలను పొందుపరిచారు. అయితే కౌన్సిల్ సభ్యుల ఆమోదం నిధుల కేటాయింపుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల వద్ద శిలాఫలకాలను ఏర్పాటు చేసేందుకు ఏకంగా రూ.20 లక్షలు కేటాయించడం పట్ల పలువురు కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం

అధికార పార్టీలోని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మద్దతుదారులైన కౌన్సిలర్ల ఒక్కో వార్డుకు రూ.50 లక్షలు కేటాయించి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మద్దతుదారులైన కౌన్సిలర్ల ఒక్కో వార్డుకు మాత్రం రూ.20లక్షలను కేటాయించారు. అంతే కాకుండా ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లకు సైతం రూ.50లక్షలు కేటాయిస్తూ ఎజెండా తయారు చేశారు. దీంతో నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మద్దతుదారులైన కౌన్సిలర్లు తప్పుపడుతున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని, నిధుల కేటాయింపులో ఇంత పక్షపాతం ఎందుకంటూ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా ఎజెండాపై గతేడాది చైర్‌పర్సన్ సంతకం లేకుండా కౌన్సిలర్లకు చేరాయి. ఈ సారి చైర్‌పర్సన్‌తో పాటు ఇన్‌చార్జి కమిషనర్ సంతకాలతో కౌన్సిలర్‌లకు ఎజెండా జారీ చేయడం విశేషం.

కమీషన్ల కోసమే ప్రాజెక్టులు

- కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి
- విస్తృతస్థాయి సమావేశంలో చెవేళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

యాలాల: తెలంగాణలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పథకంలో కేంద్ర నిధులే కీలకమని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దాచిపెట్టి ప్రజలను మభ్యపెడుతుందని చెవేళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బాగాయిపల్లిలో మండల అధ్యక్షుడు మహిపాల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టిన శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, ప్రకృతి వనాలు, సీసీరోడ్లు, బీటీరోడ్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మంజూరు చేసినవేనని, దళితబంధు పేరిట బీఆర్‌ఎస్ నమ్మక ద్రోహానికి పాల్పడుతుందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పెద్ద మోసమని, అధికార పార్టీ నాయకులకు కమీషన్ల కోసమే ప్రాజెక్టుల నిర్మాణాలంటూ ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు మాట్లాడుతూ.. నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలు పార్టీలో ఉన్నారని, పార్టీ అభివృద్ధికి, గెలుపుకోసం పాటుపడాలని పిలుపునిచ్చారు.

యువత క్షమించాలి..

పట్నంలో వ్యాపారం చేస్తున్న రోహిత్‌రెడ్డిని తాండూరుకు తీసుకువచ్చి ఎమ్మెల్యేగా గెలిచేలా కృషి చేశానని, ఈ విషయంలో తాండూరు యువత తనను క్షమించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాజీపూర్ మురళీకృష్ణగౌడ్ అన్నారు. ఇక నుంచి పట్నం నుంచి వచ్చే నాయకులను ఎమ్మెల్యేగా కాకుండా స్థానిక నాయకులకు అవకాశం ఇచ్చి, అభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీలో పలువురు చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, వెంకటేశ్, రామ్యానాయక్, హన్మంతు, వీరేశం, శివకుమార్‌గౌడ్, భీమయ్య యాదవ్, సంపత్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చేవెళ్ల: గ్రామాల్లోని పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని సర్పంచ్ అరుంధతి అన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో ఆదివారం వెల్‌స్పన్ పౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య బృందం కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజలకు గ్రామానికే వచ్చి వైద్య పరీక్షలు చేయడం వల్ల ఎంతో మంది సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. వృద్ధులు కళ్లు కనిపించకపోవడంతో ఆస్పత్రులకు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉండిపోతున్నారు. వీరంతా ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్లు తెలిపారు. వెల్‌స్పన్ పౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య మాట్లాడుతూ.. ఉచిత కంటి వైద్యశిబిరంలో దాదాపు 110 మంది కంటి పరీక్షలు చేయించుకున్నట్లు చెప్పారు. వీరిలో 26 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉండగా 55 మందికి కళ్ల అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలోనే ఉచితంగా రవాణా సౌకర్యం ఏర్పాటు చేసి ఆస్పత్రులకు తీసుకెళ్తామన్నారు. అవసరమైన వారికి కంటి అద్దాలను కూడా అందజేస్తామని తెలిపారు.